విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కీసర: మండల కేంద్రమైన కీసరలో కొత్తగా నిర్మించిన శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. కీసర అయ్యప్ప భక్తమండలి సభ్యుల ఆధ్వర్యంలో మొదటి రోజైన బుధవారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నాయకపు మాధురి, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రావన్‌కుమార్‌గుప్తా, అయ్యప్ప సేవాసమితి సభ్యులు నల్ల బాల్‌రెడ్డి, బొడును రమేష్, తటాకం లక్ష్మణ్, మొర్గు యాదగిరి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట ఆలయ హుండీ లెక్కింపు



కీసర: కార్తీకమాసం సందర్భంగా కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామికి రూ.1,06,71,839 ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం స్వామివారి హుండీ లెక్కించగా రూ.22,78,236 ఆదాయం వచ్చింది. వివిధ ఆర్జిత సేవల టికెట్ల విక్రయం ద్వారా రూ.83,93,603 ఆదాయం సమకూరిందని తెలిపారు. కీసరగుట్ట స్వామివారికి వచ్చిన ఆదాయాన్ని కీసర ఎస్‌బీఐ బ్యాంకులో స్వామివారి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో కీసరగుట్ట దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యులు కందాడి ముత్యంరెడ్డి, మచ్చాని జంగయ్యయాదవ్, రమేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ఫిల్టర్



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కీసర: భోగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన వాటర్‌ఫిల్టర్‌ను బుధవారం గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యుడు డబ్బి నర్సింహారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు పడమటి నర్సింహారెడ్డి, గ్రామస్తులు మధు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు

కీసర: సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని చర్లపల్లి రహదారిలో గల ఇండస్ట్రీయల్ ఏరియాలో ఉన్న కంపెనీల యాజమానులకు సంబంధించిన అసోషియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో 100 శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తామన్నారు. సమావేశంలో మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



కీసర: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను బుధవారం కీసర మండల వైస్‌ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, కీసర మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాదిక్ అలీ, కీసర గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, ముద్దం వెంకట్, రామారం ప్రదీప్, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు గుర్రం లక్ష్మారెడ్డి, దయానంద్‌గౌడ్, తటాకం ఉమాపతి, కుంటోళ్ల యాదగిరి, చర్లపల్లి కృష్ణారెడ్డి, జూపల్లి రవీందర్, నల్ల మధుసూదన్‌రెడ్డి, చిక్కుడు రమేష్, అరుందతీ, ముద్దం శివ, రాము, జూపల్లి సాయిలు, బాలయ్య, చినింగని నర్సింహ పలువురు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత

సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి రక్తదానం చేయాలని కొండాపూర్ సంస్కృతి కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి కళాశాలలో లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 200 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించామని, అపోహలు వీడి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీ, కళాశాల కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూదందా..!

సర్కారు భూమిలో దర్జాగా నిర్మాణాలు

- అసైన్డ్ భూముల్లోనూ జోరుగా కట్టడాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ శాఖ



కాప్రా జమ్మిగడ్డలోని స్టేడియం స్థలంలో ప్లాట్లు చేసి..



కీసరగుట్ట రోడ్డు ప్రాంతంలో ఫారెస్టు స్థలాన్ని చదును చేసి, నిర్మాణాలు చేపడుతూ..

సాక్షి, మేడ్చల్ జిల్లా: చిన్నపాటి ప్రభుత్వ స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే అధికారులు హంగామా చేస్తారు. కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ కర్తవ్యం అంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు గజాలు కాదు.. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించేస్తున్నా.. వారికి కనిపించవు. ఒకవేళ కట్టడి చేసేందుకు ముందుకు కదిలినా నేతలు ఎక్కడికక్కడ వారిని అడ్డుకుంటారు. అప్పుడు వారు నిబంధనలు పక్కనపెట్టి.. మనకెందుకొచ్చిన సమస్య అంటూ అటువైపు వెళ్లడానికి కూడా సాహసించరు. శివారుల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిస్థితి ఇలా ఉంటే.. చెరువులు, కుంటల బఫర్ జోన్లు, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కూడా జిల్లా రెవెన్యూ అధికార యంత్రాంగం చూపుతున్న ఉదాసీనత వైఖరి భూకబ్జాదారులకు వరంగా మారుతోంది.

మచ్చుకు కొన్ని..

- కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జాదారులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షలకు విక్రయిస్తున్నారు.
- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీకి ఎదురుగా ఉన్న సర్వే నంబర్–24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు భూకబ్జాదారులు స్థలాన్ని చదును చేస్తున్నారు.
- కీసర గ్రామంలోని సర్వేనంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, ఓ భూకబ్జాదారుడు దొంగ కాగితాలను సృష్టించి.. 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి, స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు పారంభించినా.. ఫారెస్టు, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఈ భూకబ్జాపై మండల ఉపాధ్యక్షుడితో సహా స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



కీసరగుట్ట రోడ్డు ప్రాంతంలో ఫారెస్టు స్థలం

- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 825లో ఉన్న 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉన్నా.. రెవెన్యూ శాఖకు పట్టించుకోవడం లేదు.
- బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష ధర నిర్ణయించి విక్రయించారు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారులు, స్థానిక రాజకీయ నాయకులు కలిసి 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా కొత్త లేఅవుట్ తయారు చేసి.. ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.
- బోడుప్పల్‌లో పార్కు, శ్మశానవాటికకు చెందిన 2,611 గజాల స్థలంతో పాటు అక్షయనగర్‌లో 509 గజాలు, వెంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం అన్యాక్రాంతమవుతోంది.
- పీర్జాదిగూడలోని 13 కాలనీల్లో మొత్తంగా ఉన్న 3 ఎకరాల పార్కుల స్థలాలు కబ్జాదారుల గుప్పిట్లో ఉంది.
- బోడుప్పల్ పరిధిలోని చెంగిచర్ల చింతలకుంట చెరువు కట్టకు సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.
- యప్రాల్‌లో సర్వే నంబర్ 171లోని బండాయికుంటను ఆక్రమించి, ప్లాట్లు చేసి అమ్ముతున్నారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని అహ్మద్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 51లో రూ.10 కోట్ల విలువ చేసే రెండెకరాల రెండు గుంటల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నంబర్ 504లో 3.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. అహ్మద్‌గూడలో సర్వే నంబర్ 22లో పార్కు స్థలం కబ్జాకు గురైంది. దమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 530లో 2 ఎకరాలు, 574లో 2.13 ఎకరాలు, బండ్లగూడలోని సర్వే నంబర్ 74లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది.
- నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు అనుకుని ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయి.
- చీర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 7, 8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.
- కీసర మండల కేంద్రంలోని 184, 185, 188, 196 సర్వే నంబర్లలోని 22 ఎకరాల సీలింగ్ భూమిని నలుగురు వ్యక్తులు కలిసి జీపీ లేఅవుట్‌తో ప్లాట్లు చేసి విక్రయించారు.
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వే నంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేటలోని 332, 233, 334 సర్వే నంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు.
- బౌరంపేటలోని 166 సర్వే నంబరులో 449 ఎకరాల అసైన్డ్ భూముల్లోని మట్టిని తవ్వి కోట్లాది రూపాయలు స్వాహా చేస్తున్నా.. రెవెన్యూశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.
- గాజుల రామారంలోని సర్వే నంబర్లు 307, 329,79, 307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా పట్టించుకోవడం లేదు.
- కీసరలోని 181 సర్వే నంబర్‌లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడున్నా కదలికలేదు.
- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కనున్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా, రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రితో పాటు ఇతర సంస్థల నిర్మాణాలు కూడా చేపట్టారు.



కీసర రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో సాగు

భూకబ్జాలను అరికట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్‌కు సీపీఐ జిల్లా నాయకుల వినతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కబ్జాదారులు వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినా.. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని వారు అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వే నంబర్లు 326, 307 పరిధిలోని దేవేందర్‌నగర్, మిథిలానగర్, బాలయ్య బస్తీ, రావినారాయణరెడి నగర్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని వారు పేర్కొన్నారు. సర్వే నంబర్–12లో హరితహారం మొక్కలు నాటితే, ఆ భూమిని కూడా కబ్జా చేశారని తెలిపారు. సూరారంలోని విశ్వకర్మ కాలనీ భూములు కబ్జా గురవుతున్నాయన్నారు. జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1లో దేవాదాయ భూమి, రాజీవ్ గృహకల్ప భూములు కబ్జా చేయటంతోపాటు అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయన్నారు. బాచుపల్లి మండలంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారన్నారు. నిజాంపేట్‌లోని మధురానగర్, అయ్యప్పస్వామి దేవాలయం వద్ద వెజిటేబుల్ మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా కొందరు కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్ట్ కాలనీ వద్ద సర్వే నంబర్: 344, నిజాంపేట్ సర్వే నంబర్ 87లో భూములు కూడా కబ్జాకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోడం లేదన్నారు. సీఎం ప్రజాదర్బార్‌లో ఈ భూకబ్జాలపై ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఉమా మహేష్, శ్రీనివాస్, హరినాథరావు, సదానందం, శ్రీనివాస్, మహేష్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

– బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

మేడ్చల్: ఎన్నికల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ప్రజలు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడూ ముందుంటానని బీజేపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆయన ఢిల్లీలో కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గెలిచిన వారు డబ్బు బలంతో గెలిచారని, తాను ప్రచారం చేసిన 16 రోజుల్లోనే బీజేపీకి 50వేల మంది ఓటు వేశారని అన్నారు. నియోజకవర్గంలోని మేడ్చల్, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లిలలో కొనసాగుతున్న రైల్వే బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయించాలని, ఉప్పల్, నారపల్లి ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచాలని, కీసరగుట్టలో ప్రసాద్ కార్యక్రమం చేపట్టాలని, కొన్ని మున్సిపాలిటీల్లో అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. శామీర్‌పేట్ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలను సహించేదిలేదు

ఆర్‌డీవో రాజేందర్

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను నిర్మిస్తే సహించేదిలేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కీసర ఆర్‌డీవో రాజేందర్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను నాలుగు రోజులుగా రెవెన్యూ అధికారులు కూల్చివేస్తున్నారు. బుధవారం కీసర ఆర్‌డీవో రాజేందర్, కాప్రా తహసీల్దార్ మతిన్, ఆర్‌ఐ శ్రీలక్ష్మీ జవహర్‌నగర్‌లో నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను పరిశీలించారు.

చర్చి కూల్చివేతపై స్థానికుల ఆగ్రహం

జవహర్‌నగర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు నెహ్రూనగర్‌లో రెండేళ్ల క్రితమే నిర్మించిన చర్చిని కూల్చివేశారు. దీంతో స్థానికులు, క్రైస్తవులు తహసీల్దార్, ఆర్‌ఐలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్ వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో చర్చిని కూల్చివేయడం సరికాదన్నారు. తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో రాజేందర్, తహసీల్దార్ మతిన్



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేస్తూ..

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: రావల్‌కోల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా గురువారం పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. రావల్‌కోల్ పరిధిలో, గ్రామంలోని అన్ని సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

భోగారంలో ఎంపీడీఓ పర్యటన



భోగారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామనాయక్ తదితరులు

కీసర: భోగారం గ్రామంలో బుధవారం ఎంపీడీఓ గ్యామనాయక్ పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను సర్పంచ్ సుంకరి కవితాజైహింద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహకు బంగారు పతకం



ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి బీఫార్మసీ విద్యార్థిని గుత్తికొండ స్నేహ 8.78 పాయింట్లు సాధించి జేఎన్టీయూ బంగారు పతకం సాధించింది. కళాశాల చైర్మన్ నల్లా నర్సింహారెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి, డీన్ కృష్ణమోహన్ అభినందించారు.

డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ



ఘట్‌కేసర్: డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ వేమననగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి జీవరత్నం(53) ఈ నెల 10న ఇంటికి తాళం వేసి సికింద్రాబాద్‌లో విధులకు వెళ్లాడు. తిరిగి బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి ఉంది. అల్మారాను పరిశీలించగా 4 గ్రాముల జత ఇయర్ రింగ్స్, 5 గ్రాముల చిన్న బంగారు గొలుసు, కొంత నగదు కనిపించలేదు. దీంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



హకీంపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేక్

శామీర్‌పేట్: కాంగ్రెస్ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా వివేక్ గెలిచిన అనంతరం తన సొంత నియోజకవర్గం చెన్నూర్‌కు వెళ్తున్న సందర్భంగా మార్గ మధ్యలోని హకీంపేట వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే వివేక్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెత్త సేకరణపై అవగాహన



కర పత్రాలు, సంచులను ఆవిష్కరిస్తున్న అధికారులు

మేడ్చల్: తడి పొడి చెత్త, హానికరమైన చెత్త సేకరణ విషయంలో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వావ్ వెల్ బీయింగ్ ఔట్ ఆఫ్ వేస్ట్ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తను మున్సిపల్ సిబ్బందికి వేర్వేరుగా ఇవ్వాలని, దీనిపై అందరికీ పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. డీఈ విజయలక్ష్మీ, ఆర్‌ఓ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



ఘట్‌కేసర్: ఎదులాబాద్ నైబర్‌వుడ్ సెంటర్ (దివ్యాంగుల పునరావాస కేంద్రం)లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఏపీఎం తౌర్యనాయక్ మాట్లాడుతూ నైబర్‌వుడ్ కేంద్రంలో నెలలో రెండుసార్లు ఫిజియోథెరపీ చేస్తామని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్యారా ప్రొఫెషనల్ సురక్షిత, కవిత, సెంటర్ సిబ్బంది శంకర్, నర్సింహ, బట్టె రవి, దివ్యాంగులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: యంనంపేట్‌లోని భూనీలా సమేత రంగనాయక స్వామి ఆలయంలో ఈ నెల 23వ తేదీన వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు బుధవారం ఆలయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందిచే బారికేడ్లు, శానిటేషన్, తాగునీరు, టాయిలెట్స్ వంటి వసతులను కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీతో చర్చించి ముందస్తుగా కావాల్సిన ఏరాట్లు చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, ఆలయ చైర్మన్ పోలగోని రాజేష్, ఈఓ భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.